# పల్లెవంతెన

భారత దేశానికి, చైనాకు మెక్ మోహన్ రేఖ ఎలా సరిహద్దును నిర్ణయిస్తుందో - అల్లాగే మావూరికి మావూరిపల్లెకూ మురుక్కాలువ సరిహద్దు రేఖగా పూర్వంనుంచి చెలామణి అవుతున్నది. ఆ మురుక్కాలువ ఏమంత పెద్దది కాదుకాని - జీవనదిలాంటిది. మున్నూట అరవై నాలుగురోజులు ప్రవహిస్తూనే వుంటుంది. పల్లెల్లోగాని బస్తీలలోగాని మంచినీటికి కరువున్నదిగాని, మురుగునీటికి లేదుగా !

పల్లెనుంచి ప్రజలు ఊళ్ళోకి రావాలంటే ముఖ్యంగా రెండు వీధులున్నాయి. పల్లెపడమటి దిక్కున నివసించే వాళ్ళంతా పడమటి వీధిగుండా ఊళ్ళోకి వస్తారు. అక్కడ

మురుక్కాలవపై వంతెన వుంది. అది పదేళ్ళ క్రితం పంచాయతీ బోర్డువారు కట్టించింది. కాని, పల్లె తూర్పు దిక్కున నివసించే వాళ్ళకు తూర్పు వీధినుంచి ఊళ్లోకి రావడం అందివుచ్చేనట్టుగా వుంటుంది, ఎక్కువమంది అటే వస్తారు. పై పెచ్చు పల్లె కంతటికి మంచినీళ్ళు సప్లయిచేసే చింతలమ్మబావి ఊరి మొదట్లోనే ఉంది. పల్లెప్రజలంతా కడవలూ, బిందెలు, బుంగలూ వుచ్చుకొని ఆ వీథిలోనుంచే వస్తారు, కాని అక్కడ మురుక్కాలవపై వంతెనలేదు. వంతెనగా మూడు తాటి బద్దెలు వేసి, పైన రెండుబళ్ళ మట్టిపోశారు. ఆ మట్టి వంతెనపై బళ్ళుగూడా పోవటానికి వీలులేదు. కేవలం మనుషులు నడవడానికే ఉపయోగ పడుతున్నది. ఆ వంతెనను గురించే ఈ కథ కూడా.

ప్రజల తాకిడి విరివిగా వుంటుందిగదా. గొడ్లూ-గోదా, బళ్ళూ పోవడానికి అనువుగా అక్కడ వంతెనెందుకు నిర్మించరాదు ? అనే ప్రశ్నకు సమాధానాలు అనేక రకాలుగావస్తూ వుంటాయి. కొంతమంది చెప్పడం అక్కడ ఎన్నికైన పంచాయతీ బోర్డు మెంబరు ప్రెసిడెంటు వైపువాడు కాదని, అక్కడ వంతెన నిర్మించడానికి ప్రెసిడెంటు ఏదో సాకు చెబుతూ ముందుకు రావడం లేదని. మరి కొంతమంది చెప్పుకోవడం ఊళ్లో రాజకీయాలే ఆ వంతెన నిర్మాణానికి అడ్డుగోడగా నిల్చాయని. ఇంకా కొంతమంది అనుకోవడం-పల్లెకు అక్కడ వంతెనపడే యోగంలేదు. ఏమైనా అక్కడ ఆ మురుక్కాలవపై వంతెన

ఏర్పడడానికి కొన్ని ప్రయత్నాలు జరుగకపోలేదు. ఆ ప్రయత్నాల జాడలు ఇప్పటికి శిథిల శకలాలవలె అగపడుతూనే వుంటాయి.

గత సాధారణ ఎన్నికలలో - అంటే అయిదేళ్ళ క్రితం ఆ నియోజకవర్గానికి ఇండిపెండెంటు అభ్యర్థిగా నిలబడ్డాయన ఓటు అడగడానికి ఆ పల్లెకొచ్చినప్పుడు, పల్లెప్రజలంతా ఏక కంఠంగా— "ముసుకాల్వలపై తూర్పువైపున వంతెన కట్టిస్తే మా ఓట్లన్నీ మీకే బేరుపోకుండా వేస్తాం!" అన్నారు. ఆ అభ్యర్థి మొహం దాగరంత్రేంది. అల్లాగే నన్నాడు. "ఎన్నికలకు ముందే వంతెన కట్టించాలి" అని నిర్బంధమాటంగా మరతుపెట్టారు. పల్లెనాయకుడు - ఎన్నికల తర్వాత అభ్యర్థి మళ్ళీ చూడానికూడా దొరకడనే వుద్దేశ్యంతో. దానికి ఒప్పుకున్నాడా అభ్యర్థి. వెంటనే నాలుగు బళ్ళ పెద్దరాయి, రెండు బళ్ళమాకా, ఓ బండి ఇసుకా తోలించాడు తన విధేయతను ప్రకటిస్తూ. అక్కడ వంతెన పడుతుందని పల్లె ప్రజలంతా సంబరపడ్డారు. కాని తర్వాత ఆ అభ్యర్థి తన గెలుపుపై తీవ్రమైన అనుమానం కలగడంతో, ఆ పైన పైసా ఖర్చు పెట్టడంకూడా చీకట్లు త్రవ్వించినట్లవుతుందని తోక ముడుచుకోవడం జరిగింది. ఆ వంతెన పడలేదు. అక్కడ తోలిన రాళ్ళూ, సున్నం తలాకాస్తా పల్లె ప్రజలు తమ ఇళ్ళముందుకు చేరవేసుకున్నారు.

మళ్ళీ ఎన్నికలు వచ్చాయి. ఇంకా పోలింగ్ తేదీ ఇరవై రోజు లున్నదనగా ఓ పార్టీ అభ్యర్థి ఆ పల్లెవచ్చాడు. నలుగురు

గ్రామపెద్దల్ని వెంటబెట్టుకొని. పల్లెనాయకుడు, మరి ముగ్గురు ఉపనాయకులు, కొంతమంది సామాన్య జనం గుమికూడారు.

"ఈసారి మీరంతా మా పార్టీకి ఓట్లివ్వాలి. నన్ను గెలిపించాలి" అన్నాడు అభ్యర్థి మలయానిలం లాంటి మంద హాసాన్ని మొహంపై చిందిస్తూ.

"మీ పార్టీకే ఓట్లిస్తాం, మిమ్మల్నే గెలిపిస్తాం. కాని ఒక్క షరతు!" అన్నాడు పల్లె నాయకుడు.

"ఏమిటది?" అన్నాడు అభ్యర్థి.

"పల్లెకు, ఊరికి సరిహద్దుగావున్న మురుక్కాలవపై తూర్పుప్రక్క వంతెన కట్టించాలి. అది ఈ ఎలెక్షన్ లోపుగా కట్టిస్తే మా పల్లె అయిదు వందల ఓట్లు "మొత్తంగా మీకే వేస్తాం" అన్నాడు పల్లెనాయకుడు ఖరాఖండిగా.

ఉపనాయకులు, అక్కడున్న పల్లెజనం అంతే! అన్నట్టు తలలాడించారు.

ఆ అభ్యర్థి గ్రామ పెద్దలను ప్రక్కకు తీసుకు వెళ్ళి కొంచెంసేపు గుసగుసలాడాడు. చివరకు తను తప్పకుండా ఎలక్షన్ తేదీకి ముందే వంతెన కట్టిస్తానని, పల్లె మొత్తం ఓటు తనకే యివ్వాలని అన్నాడు.

పల్లె నాయకుడు, ఉపనాయకులు, అక్కడున్న జనమూ 'సరే" అని తలలను గాలిలో ఆడించారు.

ఆ అభ్యర్థి మరునాడే తాటి బద్దెల వంతెన దగ్గర రాత్రి వంతెనకు సరిపడే మెటీరియల్‌ను తోలించాడు. పది మంది కూలీలను పిలిచి, నలుగురు తాపీ పనివాళ్ళను రప్పించి పని మొదలు పెట్టించాడు. వంతెన నిర్మాణం చురుగ్గా సాగుతున్నది. ఎలక్షన్ రేపనగా వంతెన పూర్తయింది. ఆ అభ్యర్థి దగ్గరుండి పల్లె నాయకునిచేత ఆ వంతెనకు ప్రారంభోత్సవం చేయించాడు. ఆ ఉత్సవంలో పల్లెలోని ప్రజలంతా ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఆ రాత్రి పదిగంటలకు ఆ అభ్యర్థికి కంచుకోటలావున్న ఆ పల్లెలోకి ఇంకోపార్టీ అభ్యర్థి మా గ్రామ మున్సబూ, మరి కొందరు ప్రముఖులూ ప్రవేశించారు. ఒక ప్రక్క నుంచి ఓటర్ల లిస్టు చదువుతూ కుటుంబాల వారిగా ఒక్కొక్క ఓటుకు పది రూపాయలు చొప్పున పంచుతూ వచ్చారు. పల్లె నాయకుడు, ఉపనాయకులూ కళ్ళప్పగించి చూస్తూనే వున్నారు. ఏం మాట్లాడలేక పోయారు. అయిదువందలమంది ఓటర్లకు అయిదు వేల రూపాయలు పంచారు. అందరు ఆ డబ్బును అందుకొని," మీకే ఓటేస్తాము" అన్నారు. సంతృప్తిగా ఆ పార్టీ వారు వెళ్ళిపోయారు.

మరునాడే ఊళ్ళో ఎలక్షన్.

పల్లెలో ఎలక్షన్ బూత్ లేదు. ఊళ్ళో ఎలిమెంటరీ స్కూల్లో రెండు బూత్‌లు పెట్టారు. ఉదయం తొమ్మిది

గంటల ప్రాంతంలో దాదాపు వంద మంది పల్లెజనం ఓట్లు వేసేనిమిత్తం పల్లెకొత్త వంతెన మీదుగానడచి ఊళ్లోకి వెళ్లారు. ఓట్లువేశారు. ఏ పార్టీ అభ్యర్థులకు వేశారో ఆ భగవంతునికే తెలియాలి. ఒకపార్టీ అభ్యర్థితో పల్లెకు కావాల్సిన వంతెనను కట్టించుకున్నారు. మరో పార్టీ అభ్యర్థినుంచి ఓటుకు పది రూపాయల చొప్పున డబ్బు పుచ్చుకున్నారు. మరి ఓట్లు ఎలా వేశారో !

పదకొండు గంటలకు మళ్ళీగుంపుగా ఆ జనం ఆ వంతెన మీదుగానే నడచి వచ్చారు. వాళ్ళు అలా వంతెన ఇవతలకు రాగానే, ఆ వంతెన మాయగా ఇట్టే కూలిపోయింది.

అందరూ ఆశ్చర్య చకితులై వెనుదిరిగి చూశారు.